బిఆర్ఎంవి హైస్కూల్ హెచ్ఎం సస్పెన్షన్

ప్రజాశక్తి - పాలకొల్లు

పురుగులతో కూడిన బియ్యంతో మధ్యాహ్న భోజనం పెట్టించినందుకుగాను పట్టణంలోని బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం ఝాన్సీని డిఇఒ వెంకటరమణ సస్పెండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ హైస్కూలు విద్యా కమిటీ ఛైర్మన్ కెల్లా పెద్దిరాజు సారథ్యంలో నెల రోజుల ముందు విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారని హెచ్ఎంకు ఫిర్యాదు చేసినా ఆమె పట్టించుకోలేదనేది అభియోగం. దీంతో వారు ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కమిటీ హైస్కూల్లో తనిఖీలు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఆ నివేదిక ప్రకారం కలెక్టర్ ఆదేశాల మేరకు డిఇఒ హెచ్ఎంను సస్పెండ్ చేశారు. హైస్కూల్లో పురుగులతో కూడిన 200 బియ్యం బస్తాలను కూడా కమిటీ గుర్తించింది.

ఇళ్లు.. ఏళ్లు..!

ముందుకు సాగని ఇళ్ల నిర్మాణం

తొలివిడతగా ఏలూరు జిల్లాలో

లక్షా 3 వేలు ఇళ్ల నిర్మాణం లక్ష్యం

ఇప్పటి వరకూ 14 వేలు పూర్తి

ఉగాదినాటికి మరో 12 వేల ఇళ్ల నిర్మాణం లక్ష్యంతో ముందుకు

ఆర్థిక భారంతోనే ముందుకు రాని లబ్ధిదారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ఒక అడుగు ముందుకు.. పది అడుగులు వెనక్కి అనే చందంగా మారింది. తొలివిడతగా ఇళ్ల నిర్మాణానికి నిర్దేశించుకున్న లక్ష్యానికి.. పూర్తయిన ఇళ్లకు ఏమాత్రం పొంతన లేకుండాపోయింది. ఇదేవిధంగా కొనసాగితే ఇళ్ల నిర్మాణ ప్రక్రియ పూర్తవడానికి ఎన్నేళ్లు పడుతుందోననే చర్చ నడుస్తోంది. ఏలూరు జిల్లాలో తొలివిడతగా 1,03,077 ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఇళ్ల నిర్మాణ ప్రక్రియ మొదలై దాదాపు రెండేళ్లు అవుతోంది. ఇప్పటి వరకూ పూర్తయిన ఇళ్ల నిర్మాణం కేవలం 14 వేలు మాత్రమే. అంటే తొలి విడత ఇళ్ల నిర్మాణ లక్ష్యంలో ఒకటో వంతు కూడా పూర్తికాని పరిస్థితి నెలకొంది. వచ్చే ఉగాది నాటికి మరో 12 వేల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా తీసుకున్నట్లు ఇటీవల జిల్లాలో పర్యటించిన గృహ నిర్మాణ రాష్ట్రస్థాయి అధికారులు తెలిపారు. దాదాపు రెండేళ్లలో 14 వేలు ఇళ్ల నిర్మాణం పూర్తవగా రెండు నెలల్లో 12 వేల ఇళ్ల నిర్మాణం పూర్తవడం ఎంతవరకూ సాధ్యమో అధికారులు చెప్పాల్సి ఉంది. ఇళ్ల నిర్మాణ ప్రక్రియ ఏలూరు జిల్లాతోపాటు పశ్చిమగోదావరి జిల్లాలోనూ నత్తనడకన సాగుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. జగనన్న లేఅవుట్లలో రోడ్లు, నీరు, విద్యుత్, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. అంతేకాకుండా చాలాచోట్ల జగనన్న కాలనీలు ఊరికి దూరంగా ఉండటంతోపాటు ఇళ్ల నిర్మాణాలకు అనుకూలంగా లేని పరిస్థితి ఉంది. దీంతో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు లబ్ధిదారులు పెద్దగా ముందుకురాని పరిస్థితి ఏర్పడింది. ఇదంతా ఒకవైపు అయితే, ఆర్థిక భారం మరో ప్రధాన సమస్యగా లబ్ధిదారులకు మారింది.

ప్రభుత్వ సాయం గోరంత.. నిర్మాణ ఖర్చు కొండంత

ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న సాయం కేవలం రూ.లక్షా 80 వేలు మాత్రమే. ఇసుక, సిమెంట్, ఐరన్, కంకర, నిర్మాణ ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. రెండు గదుల ఇళ్ల నిర్మాణం చేపట్టాలంటే తక్కువగా లెక్కించినా రూ.ఆరు లక్షలకుపైగా ఖర్చవుతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇస్తున్న సొమ్ము పునాదుల వరకూ కూడా రావడం లేదు. ఇచ్చే సొమ్ము విడతలవారీగా ఎప్పటికి వస్తాయో తెలియని పరిస్థితి. ఇళ్ల నిర్మాణం చేపడితే ప్రభుత్వం ఇచ్చే సొమ్ముకాకుండా అదనంగా రూ.నాలుగు నుంచి రూ.ఐదు లక్షల సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తోంది. అప్పు చేసి ఇళ్ల నిర్మాణం చేపడితే తీర్చే పరిస్థితి లేకపోవడంతో లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా సాయం పెంచాలని లబ్ధిదారులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అప్పు చేసి ఇల్లు కడితే వడ్డీభారం మోయలేమని, అప్పుడు కట్టిన ఇల్లు సైతం అమ్ముకోవాల్సి వస్తుందని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టకపోతే పట్టా రద్దు చేస్తామని అనేకచోట్ల లబ్ధిదారులను హెచ్చరిస్తున్న పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకుంటున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. అయినప్పటికీ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ఉత్సాహం చూపడం లేదు. తొలివిడతగా నిర్ధేశించుకున్న లక్షకుపైగా ఇళ్ల నిర్మాణం పూర్తవ్వాలంటే ఇప్పట్లో అయ్యే పరిస్థితి కన్పించడం లేదు. ప్రభుత్వం సాయం పెంచడంతోపాటు జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు పూర్తి చేస్తే కొంతలో కొంత లబ్ధిదారులు ముందుకొచ్చే పరిస్థితి ఉంటుంది.

26న ట్రాక్టర్ ర్యాలీలు జయప్రదం చేయాలి

అఖిలపక్షం రైతుసంఘాల పిలుపు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష రైతుసంఘాల నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని అఖిలపక్ష రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. ట్రాక్టర్ ర్యాలీ వాల్ పోస్టర్‌ను అఖిలపక్ష రైతుసంఘాల నాయకులు శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశానికి ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు కార్యాచరణ సమితి నేత లంకా కృష్ణమూర్తి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినీడి నాగేశ్వరరావు, అఖిలభారత అగ్రగామి కిసాన్ సభ నాయకులు దండు శ్రీనివాసరాజు, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలకు భిన్నంగా మద్దతు ధరల ప్రస్తావన లేకుండా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంతో చర్చించకుండా ఏకపక్షంగా కమిటీని నియమించిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో మద్దతు ధరల గ్యారంటీ చట్టం, రుణమాఫీ చట్టం తదితర డిమాండ్ల సాధన కోసం మరో ఉద్యమం ప్రారంభించాలని సంయుక్త కిసాన్ మోర్చా నిర్ణయించిందని తెలిపారు, పంటల బీమాను ప్రభుత్వమే చొరవ తీసుకుని అమలు చేయాలని, రైతు ఉద్యమం సందర్భంగా చనిపోయిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, రైతులపై పెట్టిన కేసులన్నీ బేషరతుగా ఉపసంహరించుకోవాలని రైతులకు, కౌలురైతులకు నెలకు రూ.ఐదు వేలు పెన్షన్ ఇవ్వాలని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. వీటి పరిష్కారం కోసం అఖిలపక్ష రైతుసంఘాల ఆధ్వర్యంలో గ్రామగ్రామాన ప్రచారం నిర్వహించి రైతులను చైతన్యవంతం చేసి ఈ నెల 26న ట్రాక్టర్ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

వ్యకాస జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ



వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు, ట్రూఅప్ ఛార్జీలు, ప్రతినెలా విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా నాయకులు ఎస్.ఆశ్రియ్య ప్రభుత్వాన్ని కోరారు. ఎపి విద్యుత్ నియంత్రణ మండలి మూడోరోజు శనివారం ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా స్థానిక ఇఇ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ శాఖాధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు పెరిగిన విద్యుత్ ఛార్జీలతో జీవనం సాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతినెలా విద్యుత్ ఛార్జీలు పెంచుకోవచ్చనే నిర్ణయం సామాన్యుల బతుకులను మళ్లీ చీకట్లోకి నెట్టేయడమేనన్నారు. రైతన్న వెన్నుముక విరిచేలా మోటార్లకు మీటర్లు పెట్టడం తగదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సిలకు ఉచిత విద్యుత్ యధావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

పటిష్టమైన రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల మరణాలు సంభవించకుండా అవసరమైన పటిష్టమైన రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గత సమావేశంలో నిర్దేశించిన పనులు ఇంకా పూర్తి కాకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల మూలంగా ఏఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దీనికి సంబంధించి రవాణా, పోలీస్, జాతీయ రహదారి, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలో ప్రస్తుతం రోడ్డు మరమ్మతు అభివృద్ధి పనుల దృష్ట్యా ప్రమాదాల నివారణకు అవసరమైన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, దీనికి ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం, అపసవ్య దిశలో వాహనాల ప్రయాణం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడం తదితర మానవ తప్పిదాలే కారణమని అన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు అధికంగా సంభవించే ప్రదేశాలు (బ్లాక్ స్పాట్స్)ను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారిపై రాత్రి సమయాల్లో నిర్దేశించిన ప్రదేశాల్లో కాకుండా రోడ్డుపై భారీ వాహనాల పార్కింగ్ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, రహదారి పెట్రోలింగ్ అధికారులు అనుమతి లేని ప్రదేశాల్లో వాహనాల పార్కింగ్ లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి టి.ఉమామహేశ్వరరావు, ఎఎస్‌పి ఎవి.సుబ్బరాజు, ఎస్ఇబి ఎస్‌పి ఎటివి.రవికుమార్, ఆర్అండ్‌బి ఇఇ ఎస్.లోకేశ్వరరావు, నేషనల్ హైవే డిఇ ఎం.శ్రీనివాసరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, భీమవరం ఆర్‌టిసి డిఎం వి.నరసింహామూర్తి, డిఇఇ ఆర్.వెంకటరమణ పాల్గొన్నారు.

రశీదు వినియోగదారుని హక్కు

మాట్లాడుతున్న మునిస్వామి

ప్రజాశక్తి - తణుకురూరల్

వస్తువు కొనుగోలు చేసినప్పుడు రశీదు అడగడం వినియోగదారుని హక్కు అని న్యాయవాది కామన మునిస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని 2, 25వ వార్డు సచివాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో మునిస్వామి మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ తాను కొనుగోలు చేసే వస్తువుకు రశీదు పొందాలన్నారు. రశీదు అనేది కొనుగోలు చేసే వస్తువుకు రక్షణలాంటిదన్నారు. వస్తువు పాడైనా లేక ఏదైనా తిరిగి ఇవ్వాలన్నా రశీదు ముఖ్యమన్నారు. వ్యాపారస్తుడు సరైన సమాధానం చెప్పకపోతే కన్స్యూమర్ కోర్టు ద్వారా తనకు నష్టపరిహారాన్ని వినియోగదారుడు పొందవచ్చునన్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. చట్టపరమైన వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం అనేక రకాలైన కంపెనీ ఉత్పత్తులు మార్కెట్లోకి వస్తున్నాయని, వాటిని అమ్ముకుని లాభాలు పొందేందుకు వినియోగదారులను మోసాలకు గురి చేస్తారని, అలా మోసపోవద్దని తెలిపారు. ఉద్యోగస్తులు, ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సేవల రూపంలో జరిగే ఏదైనా చట్ట పరిధిలోనే ఉంటుందని, దాన్ని సేవలే కదా అని అనుకోకూడదని అన్నారు. ఆసుపత్రికి వెళ్లినా, షాపులకు వెళ్లినా, సినిమా హాల్లో ఎక్కడైనా ఎటువంటి నష్టం జరిగినా.. మోసపోయినా, కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించవచ్చునని విజ్ఞప్తి చేశారు. తణుకు మండల న్యాయ సేవా సంస్థ సభ్యులు కౌరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు న్యాయ వ్యవస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందని, దానిని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. డబ్బు లేదని, న్యాయవాదిని పెట్టుకోలేమని దిగులు పడనవసరం లేదన్నారు. కోర్టులో నేరాలు రుజువైతే శిక్షలు తీవ్రంగా ఉంటాయిని, నేరం చేసే ముందు శిక్షల గురించి కూడా తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి ఎం.సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సోషలిజం మార్గదర్శకుడు లెనిన్

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

రష్యా విప్లవ యోధుడు లెనిన్ ఆదర్శనీయుడని, ఆయన బాటలో మన దేశంలో సోషలిజం సాధనకు అంతా కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. రష్యా విప్లవ యోధుడు లెనిన్ వర్థంతి స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద శనివారం నిర్వహించారు. తొలుత లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ లెనిన్ ప్రపంచ మేధావుల్లో, ప్రముఖుల్లో ఒకరన్నారు. నాడు రష్యాలో నిరంకుశమైన జార్జ్ చక్రవర్తి పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విప్లవానికి లెనిన్ నాయకత్వం వహించారన్నారు. మార్క్స్, ఎంగెల్స్ రచించిన కమ్యూనిస్టు ప్రణాళిక, వారు రూపొందించిన మార్క్సిజం సిద్ధాంతం ఆధారంగా రష్యాలో కార్మికులు, కర్షకులు, రైతులు, పేదలను కదిలించారన్నారు. ఆ విప్లవం 1917 లో జయప్రదమైందన్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలందరికీ తిండి, బట్ట, ఇల్లు, సామాజిక భద్రత, స్త్రీలకు సమాన హక్కులు, స్వేచ్ఛ, కార్మికలకు హక్కులు కలిపించబడ్డాయన్నారు. పెట్టుబడిదారీ పాలనను అంతం చేయొచ్చని, దాని స్థానంలో కమ్యూనిజం సాధ్యమేనని నిరూపించారన్నారు. రష్యన్ విప్లవ ప్రభావం, స్ఫూర్తితో జాతీయోద్యమ నాయకులు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉత్తేజపూరితంగా, త్యాగపూరితంగా పాల్గొన్నారన్నారు. నేటికీ కమ్యూనిస్టు దేశాలైన చైనా, వియత్నాం, క్యూబా, కొరియా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. భారతదేశంలో కూడా సిపిఎం సోషలిజం సాధన కోసం విశేష కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పుల్లారెడ్డి, ఎం.ఆంజనేయులు, అల్లూరి అరుణ్, బి.సత్యనారాయణ, జి.రఫాయేలు, కె.రత్నకుమారి పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

24, 25 తేదీల్లో ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నాలు -అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్



మాట్లాడుతున్న కళ్యాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు అనేక సమస్యల నడుమ విధులు నిర్వహిస్తున్నారని, తక్షణం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. అంగన్వాడీలపై వేధింపులు ఆపాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో కె.ఝాన్సీలక్ష్మీ అధ్యక్షతన యూనియన్ జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడుతూ అంగన్వాడీలు పేద గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అనేక సేవలందిస్తున్నారన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 2017 నుంచి టిఎ, డిఎలు లేవని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం మెనూకు తగినట్లుగా ఛార్జీలు ఇవ్వడం లేదని విమర్శించారు. రెండు నెలల నుండి వేతనాలు అందించకపోవడంతో పెరిగిన ధరలు, చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. 48 ఏళ్ల నుంచి సేవలందిస్తున్న అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత లేదని, సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు ఏమాత్రం ఆలోచించకుండా పర్యవేక్షణ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నాయని అన్నారు. సమస్యలన్నీ పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24, 25 తేదీల్లో ప్రాజెక్టు కార్యాలయాల ఎదుట ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. నాయకురాలు ఎ.అజయకుమారి మాట్లాడుతూ సేవలందిస్తున్న అంగన్వాడీలకు రిటైర్‌మెంట్ అయిన తర్వాత కనీసం బెనిఫిట్స్ అమలు చేయడం లేదని, సమస్యలపై అందరూ ఉద్యమించాలని కోరారు. ఈ సమావేశంలో వై.రాణి అనురాధ, కుమారి, పి.రాజమణి, నళిని, ఎ.లక్ష్మి, కె.సూర్యావతి పాల్గొన్నారు.

జిఒ నెం.1ని రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు

ప్రజాశక్తి - భీమవరం

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన దుర్మార్గమైన జిఒ నెం.1ని వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు పి.వాసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో వివిధ సమస్యలపై ఈ నెల 23 నుంచి 27 వరకు ఎస్ఎఫ్ఐ సర్వే చేస్తోందన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడే ప్రజలు, పోరాడే హక్కు కోసం కూడా పోరాడుతారని రాష్ట్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలని అన్నారు. జిఒ నెం.1 రద్దు కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. 2018లో ఉన్న మెస్ ఛార్జీలను 2023లో కూడా అమలు చేయటం సిగ్గుచేటన్నారు. ఈ నెల 23 నుంచి 27 వరకు జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని హాస్టళ్లను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించి హాస్టల్ విద్యార్థుల సమస్యలు తెలుసుకుని పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి టి.ప్రసాద్, కమిటీ సభ్యులు వి.భాను, ఎమ్‌డి.జాన్, నాగేంద్ర, రవి పాల్గొన్నారు.

అంతన్నారు.. ఇంతన్నారు..!

సంక్రాంతి పండుగ వెళ్లిపోయింది. పండుగకు ముందు.. పండుగ సమయంలో అధికారుల తీరుపై సర్వత్రా చర్చ ప్రారంభమైంది. పండుగకు ముందు పది రోజుల నుంచి కోడిపందేలు నిర్వహిస్తే అడ్డుకుంటామని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించడంతోపాటు సరికొత్తగా పోలీసు శాఖ తరపునే కాకుండా ఈ స్థలంలో పందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయా స్థలాల యజమానులతో సైతం ఫ్లెక్సీలు కట్టించారు. ఇంతవరకూ బాగానే ఉంది. అయితే పండుగ మూడు రోజులు మాత్రం కోడి పందేలు యథేచ్ఛగా సాగాయి. అయితే ఈసారి ఒక విషయంలో పోలీసు శాఖను మెచ్చుకోవాల్సిందే. అదేమిటంటే పందేలను అడ్డుకోకపోయినా పండుగ రెండో రోజు నుంచి గుండాట, పేకాట వంటి జూదాలను మాత్రం బరుల వద్ద నిరోధించారు. ఇది బరుల నిర్వాహకులను కంగుతిన్పించినా.. తామిచ్చిన మామ్ముళ్ల సంగతేంటని పోలీసులను ఎదురు ప్రశ్నించినా 70 శాతం వరకూ బరుల్లో గుండాట వంటి జూదాలను ఆపారు. గత కొన్నేళ్లకు భిన్నంగా పోలీసులు, అధికారులు పండుగ రెండో రోజైనా కళ్లు తెరిచి జూదాలపై కొరడా ఝుళిపించడం అభినందనీయం. అయితే కొంతమంది ప్రముఖులు, పెద్దల అండతో ఏర్పాటు చేసిన బరుల వద్ద ఈ జూదాలను సైతం నిలువరించకపోవడం ఆ శాఖాధికారుల్లో డొల్లతనాన్ని ప్రతిబింబించి విమర్శలకు తావిచ్చింది. ఇక పందేల విషయంలో మాత్రం ముందు చెప్పిన మాటలకు, పండుగ మూడు రోజుల చేతలకు భిన్నమైన పరిస్థితి ఉండటంపై ఆ శాఖాధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి. ఇప్పటికే రకరకాల సాకులతో పోలీసులు మండల, నియోజకవర్గస్థాయి అధికారులకు మెమోలు ఇచ్చేందుకు సిద్ధమైనా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉండటంతో వెనక్కి తగ్గినట్లు సమాచారం. అయితే గ్రామాల్లో విఆర్ఒలు, మహిళా పోలీసులు, ఆయా గ్రామాల పోలీసు కానిస్టేబుళ్లపై తూతూమంత్రంగా చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. గుండాట వంటి వాటిని నిరోధించినట్లు పందేలను సైతం అడ్డుకుని ఆపాల్సిందేనని పోలీసు ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలిచ్చి ఉంటే ఆ పందేలు సైతం ఆగేవి. చేయాల్సిన పని ఉన్నతాధికారులు చేయకుండా కింద సిబ్బందిపై నెపం మోపేలా చర్యలకు దిగాలనే ఆలోచన ఎంతవరకూ సమంజసమని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదేమైనా ఈ సంవత్సరం గుండాట వంటి జూదాలను ఆపిన తీరులో వచ్చే సంవత్సరం మరో అడుగు ముందుకేసి కోడి పందేలను సైతం అడ్డుకుంటే పోలీసు శాఖ ప్రతిష్ట పెరుగడంతోపాటు చట్టాలపై విశ్వసనీయత పెరుగుతుందని అంతా చెబుతున్నారు.

గుండాట ఆపి కోడిపందేలను ఆపకపోవడంపై పెదవివిరుపు

ఐటిడిఎకు పూర్తిస్థాయి పిఒ వచ్చేనా

ఇక జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో కెఆర్‌పురం ఐటిడిఎ ఉంది. రాష్ట్రంలోనే ఇది అతి చిన్న ఐటిడిఎగా ఉంది. గతంలో ఐఎఎస్ అధికారులను పిఒలుగా నియమించేవారు. కాలక్రమంలో ఐటిడిఎలకు నిధులు తగ్గించడంతోపాటు ఇతర శాఖల నుంచి అధికారులను డిప్యూటేషన్‌పై నియమించడం ఆనవాయితీగా మారింది. అయినప్పటికీ వచ్చిన అధికారి ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం వరకూ పని చేయడంతో గిరిజనులు తమ సమస్యలను చెప్పుకునే ప్రయత్నం చేసేవారు. తమ సమస్య పరిష్కారం కాకపోయినా గుండెల్లో బాధ అధికారులకు చెప్పుకున్నామనే తృప్తి వారికి ఉండేది. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఐటిడిఎకు పూర్తిస్థాయిలో పిఒ నియామకం చేపట్టడం లేదు. దీంతో ఏజెన్సీలోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్వాసితులైన గిరిజనులు తమ హక్కులు కోల్పోతున్నా ఎవరికి చెప్పుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. తాజాగా డిప్యూటీ కలెక్టర్ హోదాలోని అధికారిని పిఒగా నియమించి, మళ్లీ గంట వ్యవధిలోనే వేరేచోటకు బదిలీ చేయడం గిరిజనుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఏపాటిదో చెప్పకనే చెబుతోంది. ఇప్పటికైనా రాష్ట్ర ఉన్నతాధికారులు, ప్రభుత్వం, గిరిజన ప్రజాప్రతినిధులు స్పందించి కెఆర్‌పురం ఐటిడిఎకు పూర్తిస్థాయిలో పిఒను నియమించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో అధికారంలోకి రాకముందు వైసిపి నేతలు గిరిజనులకు అండగా ఉంటామంటూ ఇచ్చిన హామీలన్నీ కాకమ్మ కబుర్లుగానే గిరిపుత్రులు భావించే అవకాశం ఉంది.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

ఇళ్ల లబ్ధిదారుల సంతకాలు సేకరణ

సంతకాలు సేకరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఉండి

జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు కేటాయించాలని, టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేయాలని కోరుతూ సిపిఐ చేపట్టిన పోరుబాటలో భాగంగా ఫిబ్రవరి ఆరో తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. శనివారం ఉండి మండలం మహదేవపట్నంలో ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు కేటాయించాలని కోరుతూ జగనన్న కాలనీల ఇళ్ల లబ్ధిదారులచే సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఒకేసారి పెద్దసంఖ్యలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించడం హర్షణీయమన్నారు. అయితే ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఐరన్, ఇసుక తదితర నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు చాలక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెరిగిన ఇంటి నిర్మాణ వ్యయానికి అనుగుణంగా రూ.5 లక్షలు కేటాయించి బ్ధిదారులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, నాయకులు కోన గొల్లయ్య, తమ్మరాని శ్రీను, కర్రి సూరిబాబు, కోన మరియయేసు, నెర్లగంటి శ్రీను, ఒనుమోలు రాజేష్, వీరవల్లి రాధ, తక్కెళ్ల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ముఖేష్‌కు జిల్లా ఉత్తమ యువ ఆక్వా రైతు అవార్డు

ప్రజాశక్తి - కాళ్ల



అవార్డు అందుకుంటున్న ముఖేష్

పెదఅమిరం గ్రామానికి చెందిన సరాబు ముఖేష్ జిల్లా ఉత్తమ యువ ఆక్వా రైతు అవార్డును సాధించారని ఆక్వా ఎక్స్‌పోచీఫ్ ఆర్గనైజర్ కోనా జోసెఫ్ తెలిపారు. శనివారం కాకినాడలో జరిగిన 22వ ఆక్వా టెక్ ఎక్స్‌పోలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు వంగా గీత చేతుల మీదుగా ముఖేష్ ఈ అవార్డును అందుకున్నారు. 2022 సంవత్సరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉత్తమ యువ ఆక్వా రైతు అవార్డును పెదఅమిరం గ్రామానికి చెందిన సరాబు ముఖేష్ సాధించడం పట్ల పలువురు ఆక్వా రైతులు ముఖేష్‌ను అభినందించారు. పెదఅమిరం ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేశారు.

26న మాంటిస్సోరీలో ఉచిత అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లజపతిరాయ్ పేట మాంటిస్సోరిలో ప్లే స్కూల్‌లో శ్రీపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేద పండితుల ఆధ్వర్యంలో అక్షరాభ్యాస మహోత్సవం జనవరి 26వ తేదీ గురువారం నిర్వహించనున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ కెవి.కృష్ణవర్మ తెలిపారు. జూనియర్ కాలేజీ ప్రాంగణంలో జరిగే ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలతో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి పూజా సామగ్రితో పాటు పలక, బలపం, పుస్తకం, పెన్ స్కూలు తరపున ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

మానసిక వికలాంగుల కేంద్రానికి కంప్యూటర్లు

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యార్థులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానం అధిరోహించాలని సీనియర్ సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టు మేనేజర్ బెజవాడ తులసిరావు చెప్పారు. తులసిరావు పాలకొల్లు అంజలి మానసిక పాఠశాలకు రెండు కంప్యూటర్లు శనివారం బహుకరించారు .ఈ కార్యక్రమంలో వివిడి.అంజలిదేవి, ప్రధానోపాధ్యాయులు ఆర్.భవానీప్రసాద్, మండల విద్యాశాఖ కో-ఆర్డినేటర్ తోకల జనార్ధన్, వి.సాయిసూర్యనారాయణ. సత్యనారాయణ, ఎం.సందీప్ పాల్గొన్నారు.

బాలికల వసతి గృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

బ్రాహ్మణచెరువులో నిరుపయోగంగా ఉన్న బాలికల వసతి గృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీ రంగనాధరాజు అధికారులను ఆదేశించారు. గడపగడపకూ మన ప్రభుత్వం బ్రాహ్మణచెరువులో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమకు పెన్షన్ లబ్ది చేకూర్చాలని, ఇంటి స్థలం కేటాయించాలని ఎంఎల్‌ఎను కోరారు. దీనిపై ఎంఎల్‌ఎ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని అధికారులకు సూచించారు. తాలుత ఆలమూరులో గడపగడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకటశ్రీనివాసరాజు, గ్రామ అధ్యక్షులు తేతలి సుధీర్‌రెడ్డి, వైసిపి నాయకులు గాదిరాజు సాయిరామరాజు, తాడిపర్తి ప్రసన్న, ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి), ఎఎంసి చైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, ఎంపిడిఒ బి.పూర్ణబాబ్జి పాల్గొన్నారు.

2,3 తేదీల్లో నరసాపురంలో డాక్టర్ రవివర్మ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రముఖ ఆయుర్వేద గిరిజన వైద్య నిపుణులు డాక్టర్ రవివర్మ ఫిబ్రవరి 2, 3 తేదీల్లో నరసాపురం అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రంలో అందుబాటులో ఉంటారని ఆ కేంద్రం కోశాధికారి బాబు శ్రీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ రవి వర్మ స్థానికలను పరీక్షించి తగు మందులు ఇస్తారని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రవి వర్మ నరసాపురం వస్తున్నారని, స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వైద్యం చేయించుకోవాల్సిన వారు సాంస్కృతిక కేంద్రం 9866124020, 9014116303, 08814 274020, నేరుగా వచ్చి రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ఉచితమని తెలిపారు. జనవరి నెలాఖరులోపు రిజిస్టర్ చేసుకున్న వారికే వైద్యం చేస్తారని తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జిల్లాలో లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని జోన్ చైర్ పర్సన్ లయన్ వట్టిప్రోలు రాము అన్నారు. స్థానిక పేరిచర్ల ఫౌండేషన్ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షులు కోనా హనుమాన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు 666 కార్యక్రమాలు చేసిన క్లబ్‌గా డైమండ్స్ మొదటి స్థానంలో నిలిచినందుకు క్లబ్ మొదటి గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు సహకారంతో అంతర్జాతీయ పిన్ అందించారు. చిల్డ్రన్స్ హోమ్‌కు, వృద్ధులకు క్లబ్ అడ్మినిస్ట్రేటర్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, కోనా శ్రీనివాస్ సహకారంతో బియ్యం బస్తాలు అందించారు. ఈ సందర్భంగా జోన్ చైర్ పర్సన్ వట్టిప్రోలు రామును శాలువాతో సత్కరించి క్లబ్ మెమొంటో అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ బుద్దాల విజయ్‌బాబు, బోళ్ల రాము,హేమసుందర్, ఆనంద్ స్వరూప్, పట్నాల రామకృష్ణ కుమార్ పాల్గొన్నారు.

జిన్నూరులో రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని జిన్నూరులో జెడ్‌పి నిధులు, గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులు దాదాపు రూ.1.20 కోట్ల నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణాలను సర్పంచి జమ్ము బేబీ మహాలక్ష్మి శనివారం పర్యవేక్షించారు. ఆమెతో పాటు సొసైటీ చైర్మన్ డిటిడిసి బాబు, ఉపసర్పంచి దండు వెంకట గోపాలకృష్ణంరాజు, ఎఎంసి డైరెక్టర్ జమ్ము మృత్యుంజయరావు, వార్డు మెంబర్లు మేడిది నిర్మలకుమారి, రామదాసు ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి విక్రయాలపై నిఘా

ఆరుగురు అదుపులోకి?

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో గంజాయి విక్రయాలపై, తాగుతున్నవారిపై పోలీసులు నిఘా పెంచారు. ఈ క్రమంలో శనివారం రాయకుదురు గ్రామంలో గంజాయి తాగుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరికి గంజాయి విక్రయించిన వారి వివరాలు తెలుసుకునేందుకు ఆ యువకులను పాలకొల్లు తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. పోలీసులు అదుపులోకి తీసుకున్న యువకులు గంజాయి తాగేవారా, లేదా విక్రయించేవారా అనేది పోలీసులే తేల్చాల్సి ఉంది. గంజాయి నిందితుల విషయంలో పోలీసులు గోప్యం పాటిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

యలమంచిలి : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కలగంపూడి పెట్రోల్ బంకు సమీపంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. యలమంచిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణాజిల్లా, కృత్తివెన్ను మండలం మాట్లం గ్రామానికి చెందిన బొమ్మిడి వెంకటరెడ్డి (22) రాజోలు నుంచి చించినాడ మీదుగా కృష్ణాజిల్లా బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కలగంపూడి పెట్రోల్ బంకు సమీపం వద్ద ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు దిగమర్రు వైపు నుంచి వస్తూ స్కూల్ వైపునకు తిరుగుతుండగా వెంకటరెడ్డి బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన వెంకటరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఏలూరుపాడులో తాగునీటి వెతలు

పగిలిన పైపులైన్
ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా
సమస్య పరిష్కారానికి చర్యలు

ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న మహిళలు

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడులో పైపులైన్ పగిలింది. గ్రామ ప్రజలు స్వచ్ఛమైన నీటిని కొనుగోలు చేసుకుని తాగాల్సిన పరిస్థితి నెలకొంది. సర్పంచి జగ్గరాజు, ఉప సర్పంచి ధనలక్ష్మి స్పందించి తాత్కాలికంగా చెరువులో నీటిని వినియోగించేందుకు ట్యాంకర్ ద్వారా ఒక పూట అందిస్తున్నారు. పైపులైన్ మరమ్మతులు ముందస్తుగా గుర్తించకుంటే తాగునీటి కోసం అష్టకష్టాలు పడే పరిస్థితులు రానున్నాయి. జనవరిలోనే ఈ పరిస్థితి ఉంటే వేసవిలో తాగునీటి కోసం మరింత ఇక్కట్లు పడే అవకాశాలు ఉంటాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఏలూరుపాడు మేజర్ గ్రామ పంచాయతీలో ప్రధాన పైపులైన్ పగిలిపోవడంతో మూడు రోజుల నుంచి కుళాయిల ద్వారా నీరు రాకపోవడంతో గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు. గ్రామంలో పెద్దపేట, కొత్తపేట, రామాలయం వీధుల్లో కుళాయిల ద్వారా నీరు రావడం లేదు. గ్రామంలో ప్రధానంగా తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. కుళాయిల ద్వారా నీరు రాకపోవడంతో ఆర్థిక స్తోమత కలిగిన ప్రజలు మినరల్ నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. ఆ ప్రాంత ప్రజలు గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజుకుకు విన్నవించడంతో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా తాత్కాలికంగా మంచినీటి చెరువులోని నీటిని ట్యాంకర్ ద్వారా అందించే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామ ఉప సర్పంచి నల్లగచ్చు ధనలక్ష్మి, ఆమె భర్త నల్లగచ్చు నాగార్జున మంచినీటి ట్యాంకర్ ద్వారా నీటిని ఆ ప్రాంత ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారు. పైపు లైన్ మరమ్మతులు త్వరితంగా చేపట్టి నీటిని అందించేందుకు కృషి చేస్తున్నారు.

పైపులైన్ మరమ్మతులు

ప్రజలకు స్వచ్ఛమైన అందిస్తాం
టి.రత్నాకరరావు, గ్రామ కార్యదర్శి, ఏలూరుపాడు

పైపులైను మరమ్మతు పనులు రూ.50 వేలతో చేసి ప్రజలకు స్వచ్ఛ నీరు పూర్తిస్థాయిలో అందిస్తాం. శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

సత్తినేనిమెరకలో అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి సత్తినేనివారిమెరకలో ఉన్న మోగధారమ్మ ఆలయ ప్రాంగణంలో శనివారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన జాతర ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అమ్మవారికి నిర్వహిస్తున్న ఉత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన సత్తినేని రామకృష్ణ సత్యవతి దంపతులు అమ్మవారికి నివేదించిన 18 కేజీల లడ్డును గ్రామానికి చెందిన సత్తినేని త్రినాధ్ రూ.పది వేలకు పాట పడి సొంతం చేసుకున్నారని కమిటీ సభ్యులు తెలిపారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను సందర్శించిన అప్పారావు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కొత్తోట గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సెంటర్‌ను నరసాపురం డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జిల్లా గ్రామ వార్డు సచివాలయ పర్యవేక్షణ అధికారి కెసిహెచ్.అప్పారావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు దినేష్‌కుమార్‌ను ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంపిడిఒ ఆర్‌సి ఆనంద్‌కుమార్, ఇఒపిఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు అందించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ మురళి

ప్రజాశక్తి - భీమవరం


మాట్లాడుతున్న జెసి మురళి

జిల్లావ్యాప్తంగా నవరత్నాల్లో భాగంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేశామని, మిగిలిన అర్హులకూ భూసేకరణ చేసి ఇళ్లస్థలాలు అందించాలని జాయింట్ కలెక్టర్ జెవి.మురళి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా .జెసి మాట్లాడుతూ ఇంటి పట్టా తీసుకుని ఇల్లు కట్టుకునేందుకు నిరాకరిస్తున్న పట్టాదారుల వివరాలు లేఔట్ వారీగా సేకరించాలని సూచించారు. దీనికి గల కారణాలను ఆర్‌డిఒ, సబ్ కలెక్టర్ హౌసింగ్ ఇఇల ఆధ్వర్యంలో టీములు ఏర్పాటు చేసి ఒక వారంలో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. శ్మశాన వాటికలకు భూములను గుర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ రాజు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సమన్యాయం

మాట్లాడుతున్న ప్యానల్ లాయర్ సునీల్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

న్యాయ సేవాధికార చట్టం ప్రకారం తక్కువ సమయంలో సమ న్యాయం పొందే అవకాశం ఒక్క లోక్ అదాలత్ ద్వారానే సాధ్యమని ప్యానల్ లాయర్ బి.సునీల్ కుమార్ అన్నారు. ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై గ్రామస్థాయిలో అవగాహన కల్పించేందుకు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సునీల్‌కుమార్ అధ్యక్షతన మండలంలోని వెంప గ్రామ సచివాలయం వద్ద శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ 11న లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎన్.రమేష్, ఎన్.సుధీర్, పిఎల్‌వి. కమల్‌రాజు, సర్పంచి రాజేశ్వరి, సెక్రటరీ మోహనకృష్ణ, విఆర్‌ఒ ముత్యాలరావు, ఎంపిటిసి సభ్యులు కుమార్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి : లబ్ధిదారులు

ప్రజాశక్తి - వీరవాసరం

జగనన్న లే అవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పంచాలని లబ్ధిదారులు కోరుతున్నారు. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో కారణాలను తెలుసుకునేందుకు అధికారులు శనివారం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. వీరవాసరం మండల ప్రత్యేకాధికారి, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, హౌసింగ్ ఎఇ గాంధీ, ఐసిడిఎస్ విస్సాకోడేరు సెక్టార్ సూపర్‌వైజర్ వాణివిజయరత్నం బృందం నవుడూరు పంచాయతీ పరిధిలోని బొప్పనావారిపాలెంలో లబ్ధిదారులకు కేటాయించిన లేఅవుట్‌కు వెళ్లి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఈ లేఅవుట్‌లో మొత్తం 47 మంది లబ్ధిదారులుండగా ముగ్గురు మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇందుకు ల కారణాలను అధికారులు లబ్ధిదారులను అడుగగా త్వరలోనే ఇళ్ల నిర్మాణం చేపడతామని, నిర్మాణ సామగ్రి తీసుకెళ్లడానికి ఇబ్బంది లేకుండా కాలనీలో రోడ్లు వేయాలని కోరారు. ఇళ్ల నిర్మాణం చేపట్టండని, అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

అత్తిలి : జగనన్న హౌసింగ్ లే అవుట్‌లోని గృహాలకు మౌలిక వసతులు కల్పించాలని హౌసింగ్ ప్రత్యేక అధికారి కె.మురళీకృష్ణ, ఎంపిపి మక్కా సూర్యారావు, ఎంపిడిఒ వివివిఎస్.రామారావు అన్నారు. కొమ్మరలో జగనన్న లే అవుట్‌లో హౌసింగ్ డేలో భాగంగా లబ్ధిదారులకు శనివారం అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల కృషితో ప్రస్తుతం లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ కె.సత్యనారాయణమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

మొగల్తూరు : జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి వి.విజయలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని శేరేపాలెం గ్రామంలోని లే అవుట్‌ను ఆమె శనివారం పరిశీలించారు. శేరేపాలెంలో 47 ఇళ్లు మంజూరు కాగా 30 మంది ఇళ్లు నిర్మించుకుంటున్నారని, మరో ఏడుగురు నిర్మాణాలు చేపట్టలేదని, కొత్తపాలెం లే అవుట్‌లో 33 మందికి ఐదుగురు మాత్రమే నిర్మాణాలు చేపట్టారని హౌసింగ్ ఎఇ ఫణీంద్ర ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె లబ్ధిదారులతో మాట్లాడుతూ రూ.లక్షలు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేశామని, మౌలిక సదుపాయాలు కల్పించామని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు రాకపోవడానికి కారమేంటేని ప్రశ్నించారు. త్వరలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

కాళ్ల :మండలంలో పలు పంచాయతీల్లో చేపడుతున్న జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేసేలా సచివాలయ సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి కె.కిషోర్‌కుమార్ కోరారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శనివారం సమీక్షించారు. ఎంపిడిఒ జి.స్వాతి మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ఇళ్ల నిర్మాణం ఎలా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, తాగునీరు పలు అంశాలపై చర్చించారు. అనంతరం కాళ్ల, జక్కరం లే అవుట్లను పరిశీలించారు. ఈ లేఅవుట్లలో విద్యుత్, రహదారులు, తాగునీటి సదుపాయాలు త్వరితంగా ఏర్పాటు చేయాలని హౌసింగ్ ఎఇ పి.ఆంజనేయరాజు తెలిపారు.

లంబసింగి స్టడీ యాత్రకు పాలకొల్లు యూత్ హాస్టల్ సభ్యులు

పాలకొల్లు :యూత్ హాస్టల్ పాలకొల్లు యూనిట్ సభ్యులు 40 మంది లంబసింగి, కొత్తపల్లి వాటర్ పాల్స్ స్టడీ కమ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు శనివారం రాత్రి బయలుదేరారు. పాలకొల్లు హాస్టల్ సభ్యులు దేశంలోని వివిధ ప్రాంతాలకు సాహస యాత్రలు చేస్తుండటం అభినందనీయమని యూనిట్ అధ్యక్షులు పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ అన్నారు. పాలకొల్లు నుంచి తిరువనంతపురం వరకు, పాల కొల్లు నుంచి అయోధ్య వరకు మెటార్ సైకిల్ యాత్ర, ఢిల్లీ నుంచి పాకిస్తాన్ సరిహద్దు వరకు సాహస మోటార్ సైకిల్ యాత్ర చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, సొలస త్రినాధ్, బాలి రెడ్డి, శ్రీ రంగ నాయకులు, డి.వెంకట్రావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ

ఆచంటలో...

ప్రజాశక్తి - ఆచంట

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని ఆచంట ఎస్ఐ బిఎస్‌డిఆర్.ప్రసాద్ అన్నారు. ఆచంట కచేరి సెంటర్‌లో ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల కొంతవరకు తమ ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ ఉద్యోగాల పేరిట మోసాలు జరుగుతున్నాయన్నారు. యువత వాటి బారిన పడి మోసపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే జాప్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు నడిపితే ఆ బాధ్యత తల్లిదండ్రులే వహించాల్సి వస్తుందని సూచించారు. యువకులు ద్విచక్ర వాహనాలపై మితిమీరిన వేగంతో నడిపితే లైసెన్స్‌తోపాటు వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించిన వాహనదారులకు చాక్లెట్లు పంపిణీ చేసి అభినందించారు. అనంతరం హెల్మెట్ ధరించని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ సిఐ జి.దాసు సూచించారు. 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం భీమవరం పట్టణంలో హెల్మెట్ ధరించిన వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు చాక్లెట్లు అందించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా హెల్మెట్ల గురుంచి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. హెల్మెట్ ధరించిన ద్విచక్రవాహనదారులకు చాక్లెట్, పువ్వులు అందించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఎస్‌కెఎస్‌డి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు రూరల్

అండర్-19 కళాశాల విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు తమ ప్రతిభ చూపించారు. ఏలూరు జిల్లా పెదవేగి గురుకుల హైస్కూల్‌లో జరిగిన టెన్నికాయిట్ విభాగంలో ఎ.సింధు ప్రథమ స్థానం, నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించిన క్రీడా పోటీలలో నెట్‌బాల్ విభాగంలో టి.దేవిరమ్య ద్వితీయ స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ బిహెచ్.హిమబిందు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, కళాశాల ట్రెజరర్ నందిగం సుధాకర్, ఎఒ డాక్టర్ డి.సుబ్బారావు, ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు అభినందించారు.

విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

వేగంగా సిద్ధాంతం ఇసుక ర్యాంపు పనులు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని సిద్ధాంతం ఇసుక ర్యాంపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో తమకు ఉపాధి దొరుకుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక సరఫరా ఖర్చులు తగ్గుతాయని, దీంతో భవన నిర్మాణ పనులు వేగం పుంజుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. నాణ్యమైన ఇసుక దొరుకుతుందని ప్రజలు తెలుపుతున్నారు.

'వైసిపి హయాంలో ప్రజలకు నష్టాలే'

ప్రజాశక్తి - మొగల్తూరు

వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిడిపి మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ సిరిగినీడి రాజలక్ష్మి విమర్శించారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని ముచ్చలపల్లిలో బండి ముత్యాలమ్మ ఆలయం వద్ద శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు, నియోజకవర్గ నాయకులు తిరుమని శశిదేవి, పాల దుర్గాభవాని, గోపాలం, అలవల మంగతాయారు, బస్వాని ఏడుకొండలు, కొల్లాటి బాలకృష్ణ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు జనసేన చేయూత

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన నిరాశ్రయులకు జనసేన అండగా నిలబడుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. మండలంలోని ఉప్పులూరు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సర్వస్వం కోల్పోయిన గంధం సాయిబాబు కుటుంబాన్ని జుత్తిగ నాగరాజు శనివారం పరామర్శించి పార్టీ తరపున రూ.37,500 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సర్వస్వం కోల్పోయిన గంధం సాయిబాబుకు ప్రభుత్వం పక్కా ఇంటిని నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు మాట్లాడుతూ వారం రోజుల క్రితం ప్రమాదం సంభవించి ఇల్లు కాలిపోయిన గంధం సాయిబాబు కుటుంబానికి ఇప్పటివరకు ప్రభుత్వం తరపున సహాయం అందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఎడవల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు పోలిశెట్టి బ్రహ్మానందం, పడమటి త్రిమూర్తులు, నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - అత్తిలి

ఆరవల్లి హైస్కూల్, మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపిపి మక్కా సూర్యారావు శనివారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం భుజించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎప్పటికప్పుడు తాజా కూరగాయాలతో మధ్యాహ్న భోజనం వండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, ఆరవల్లి గ్రామ ఉప సర్పంచి వెలగల అమ్మిరెడ్డి, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

సచివాలయాల్లో సుమారు 543 సేవలు అందిస్తున్నామని, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా గ్రామ వార్డు సచివాలయాల పర్యవేక్షణ అధికారి కెసిహెచ్.అప్పారావు సూచించారు. మండలంలోని పాతపాడు, కొత్తోట, మొగల్తూరులోని సచివాలయాలను ఆయన శనివారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కళ్యాణ మస్తు పథకంపై అవగాహన కల్పించి అర్హులు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ఆధార్ సర్వీసుల సెంటర్లలో బమోగ్రాఫిక్, బయోమెట్రిక్ సేవలను ప్రజలకు అందించాలన్నారు. మహిళా పోలీస్, ఎఎన్ఎం, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఎంపిడిఒ ఆర్‌సి ఆనందకుమార్, ఇఒపిఆర్‌డి నవీన్‌కిరణ్ ఉన్నారు.

మావుళ్లమ్మకు విరాళంగా బంగారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో ఉన్న మావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన కోలా రమేష్, స్నేహ దంపతులు శనివారం ఆలయ అధికారులకు ఎనిమిది గ్రాముల బంగారాన్ని విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ముత్యాల వెంకట రామారావు, తాళ్లపూడి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయింది

కేత సీత, భర్త: నాగ పండు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. సిద్ధాంతం నుండి పెనుగొండ వస్తుండగా మార్గమధ్యంలో పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ **L9025927** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్కు తెలియజేయగలరు.

కేత సీత
భర్త : నాగపండు, సిద్ధాంతం
పెనుగొండ మండలం, ప॥గో॥జిల్లా.
సెల్ : 95532 72178

పాస్‌పోర్టు పోయినది

KURELLA DURGA అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 07-11-2017న **R5904913** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు నరసాపురం పట్టణం మెయిన్ రోడ్డుకు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

KURELLA DURGA
W/o. K.Venkateswara Rao
D.No. 13-1-28/2, Near Medrla Bridge
Narasapur-534275, West Godavari Dist., A.P.,

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు :: అమలాపురం
ఓ.ఎస్.నెం. 21/2022

Between:
బొంతు కృష్ణ కుమారి ...వాది
అండ్
పి.వి.కృష్ణం రాజు ...ప్రతివాది

ప్రకటన

పెనుమత్స వంశీ కృష్ణంరాజు, తండ్రి: రామకృష్ణం రాజు, హిందూ, డాక్టర్, వయస్సు 27 సం॥లు, డో.నెం. 33-8-2, కంచి రాజు గారి వీధి, తణుకు, తణుకు మండలం, టౌన్ హాల్ కాంప్లెక్స్ ఎదురుగా, తణుకు, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో ఓ.ఎస్.నెం. 21/2022లో శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం ప్రతివాది అయిన మీకు నోటీసు పేపరు ప్రకటన ద్వారా తెలియేయడమైనది. వాయిదా రోజున మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పైన తెలిపిన వారి కోర్టులో హాజరు కావలెను. లేనిచో పరోక్షముగా తీర్మానితులు అవుదురు.

వాయిదా తేదీ: 30-01-2023
సమయం: 10:30 ని॥లకు

కె.మల్లపరాజు
కె.ఎస్.శ్రీరామ్,
అడ్వకేట్స్, అమలాపురం.

మహారాజశ్రీ ఏలూరు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు జిల్లా
ఓ.యస్.నెం. 8/2022

బిట్వీన్:
శ్రీ వేగుంట మాధవరావు ...వాది
VS
శ్రీమతి వూరకరణం సీతాదేవి and 6 వగైరా ...ప్రతివాదులు

1) సదరు దావాలో 4వ ప్రతివాది చిరునామా:
D4: To: శ్రీమతి మాదిరాజు విజయలక్ష్మి, భర్త: ఎం.రవీంద్రనాధ్ ఠాగూర్, తండ్రి: లేటు వి.రామారావు, C/o. మాధవరావు, డౌన్ ఫ్లోర్, ఎన్.కళేశ్వరరావు హౌస్, గాంధీ మైదానం దగ్గర, పడమర వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా.

2) సదరు దావాలో 6వ ప్రతివాది చిరునామా:
D6: To: వూరకరణం నిఖిత, తండ్రి: లేటు జగన్‌మోహనరావు, గణేష్ ఉమశ్రీ అపార్ట్‌మెంట్, 3వ ఫ్లోర్, ప్లాట్ నెం. 303, దొంగల మండపము దగ్గర, పడమర వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా.

మీరు పై తెలిపిన ఓ.ఎస్.నె. 8/2022లో 4వ ప్రతివాది మరియు 6వ ప్రతివాది అయి ఉన్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం మీరు **ఫిబ్రవరి నెల 10వ తేదీ 2023వ సం॥రం ఉదయం గం॥ 10:30 ని॥లకు కోర్టులో హాజరు కావలెను.** లేని ఎడల సదరు గ్రంధము మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేదీ: 10-02-2023

కె.ఆర్.కె.చౌదరి, అడ్వకేట్,
ఏలూరు. సెల్: 98486 05066